www.aryadvi.com
తెలుగు దినపత్రిక
News Daily

# ఆర్యాద్వి

మంగళవారం
13-10-2026
అక్షర సత్యం - ప్రజా సాక్ష్యం
సంపుటి (VOLUME) : 1 సంచిక (ISSUE): 1
పేజీలు : 8
వెల : 1/-
Simultaneously Published from: Hyderabad | Vijayawada | Visakhapatnam




మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



## ఎల్ఓసీ వద్ద మందుపాతర పేలుడు: నలుగురు ఉగ్రవాదులు మృతి

- కృష్ణ ఘాటిలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం
- మెంధర్‌లో రెండు పాత మందుపాతరలను నిర్వీర్యం చేసిన సైన్యం

జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక - మిగతా 2లో

### విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..

## నలుగురి సజీవదహనం

- విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు
- ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన
- మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

- మిగతా 2లో



### ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..

## రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం



- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు - మిగతా 2లో



## ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

### సుప్రీంకోర్టులో ఇండియా కూటమి పిటీషన్లలోని ముఖ్యాంశాలు

:ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ లపై ఇండియా కూటమి నేతలు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. 2026 అక్టోబర్ 12న - మిగతా 2లో

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాష్ మాథుర్ కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు. - మిగతా 2లో



## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

### స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్

- ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ
- ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు

- మిగతా 2లో



### రేడియల్ రోడ్ టెండర్లలో

## అవకతవకలు

### రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..

- రూ.3,296 కోట్ల టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపణ
- రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని విమర్శ
- సీఎం కార్యాలయం నుంచి టెండర్లలో పాల్గొనవద్దని ఫోన్లు వచ్చాయని వెల్లడి
- ఈ వ్యవహారాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని ప్రకటన
- అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- న్యాయపోరాటం చేస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టీకరణ - మిగతా 2లో




## భాజపా వ్యతిరేకుల ఓట్ల తొలగింపునకు కుట్ర

రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఓటు హక్కు కల్పించడానికి SIR చేపట్టారని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల ఓట్లను తొలగించడానికే దీనిని వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో సీఎం మీడియాతో మాట్లాడారు.

- ఎస్ఐఆర్‌తో ఓట్లు తొలగిస్తున్నారని సీఎం ఆరోపణ
- యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లే లక్ష్యమని వ్యాఖ్య
- ఎన్నికల కమిషన్‌పై మోదీ ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని విమర్శ
- దేశంలో జనాభా పెరుగుతున్నా ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గిందని ప్రశ్న

"మోదీ తన అధికారం నిలబెట్టుకునేందుకు గతంలో ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగాలను వాడుకున్నారు. ఇప్పుడు వాటితో పని జరగడం లేదని.. ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుంటున్నారు. భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించేందుకు ప్రస్తుతం ా×=ను తెచ్చారు. తమ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు టాస్క్ ఇచ్చారు. ప్రధానంగా భాజపాను వ్యతిరేకించేది.. యువత, నిరుద్యోగులు, పేదలు. వీరి ఓట్లను తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారు. సీఈసీలో తప్పులు జరిగాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారు. జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి అధికారిని తొలగించేందుకు మోదీకి అభ్యంతరం ఏమిటి?"

"సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో భాజపా ఓడిపోయింది. ఈ ప్రక్రియ జరిగిన బిహార్, బెంగాల్‌లో భాజపా గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా.. మరి ఎందుకు తగ్గింది?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?

### ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం - మిగతా 2లో

### 'నో' చెప్పారా.. మీ ఖాతాలో

## నగదు మాయం



సైబర్ మోసాలపై హైదరా బాద్ సీపీ సజ్జనార్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. 'నో' అని ఒక్కసారి రిప్లై ఇచ్చినా ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదముం దని చెప్పారు. ఓటీపీలు చెప్పకపోయినా.. లింకులపై క్లిక్ చేయకపోయినా నగదు మాయమయ్యేలా - మిగతా 2లో

### రోడ్లపై కాదు.. ఆధారాలతో

## ఈసీ వద్దకు వెళ్లండి

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన
- ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య - మిగతా 2లో
- ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని కలవాలని ప్రతిపక్షాలకు సూచన



## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..

## రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.

రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి. ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

## 2100 నాటికి మానవ వినాశనం? 17 ముప్పులను గుర్తించిన లాన్సెట్!

రాబోయే 75 ఏళ్ల కాలంలో మానవాళి మనుగడ తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందా? శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఊహించని పురోగతి సాధిస్తున్న మనిషి, తన చేతులారా తనే వినాశనాన్ని కొనితెచ్చుకుంటున్నాడా? అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ 'ది లాన్సెట్' విడుదల చేసిన నివేదిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. 2100 నాటికి మానవ ఉనికికే ఎసరు పెట్టే 17 ప్రధాన ముప్పులను నిపుణులు గుర్తించారు. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆ తీవ్ర ముప్పుల విశేషాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

**మనిషి కొనితెచ్చుకుంటున్న వినాశనం:**
ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యాలు లేదా అంటువ్యాధుల వల్ల మాత్రమే మానవాళికి ముప్పు ఎదురయ్యేది. కానీ రాబోయే రోజుల్లో ప్రపంచానికి ఎదురయ్యే అతిపెద్ద ముప్పులు పూర్తిగా మానవ నిర్మితమేనని లాన్సెట్ కమిషన్ హెచ్చరించింది. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆధునిక సాంకేతికత, అణ్వాయుధాలు మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల చూపిస్తున్న తీవ్ర నిర్లక్ష్యమే ఈ వినాశనానికి ప్రధాన కారణాలుగా మారనున్నాయి.

**ఏఐ దుర్వినియోగం, అణు యుద్ధ భయాలు:**
కృత్రిమ మేధ సాంకేతికతను సరిగ్గా వాడుకుంటే పర్వాలేదు కానీ, దాని దుర్వినియోగం పెరిగితే కోట్లాది మంది ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు అణు సమరం గనుక సంభవిస్తే.. దాని వల్ల వచ్చే పొగ, ధూళి సూర్యరశ్మిని భూమికి చేరకుండా అడ్డుకుంటాయి. ఇక దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి, పంటలు పండక ఆకలి చావులు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉందని ఈ అధ్యయనం హెచ్చరించింది.

**కనిపించని ఆరోగ్య, సామాజిక సంక్షోభం:**
ఇక కేవలం అణు యుద్ధాలు లేదా ఏఐ మాత్రమే కాకుండా వాతావరణ మార్పులు, పెరిగిపోతున్న వాయు కాలుష్యం, మానసిక ఆరోగ్య సమస్యలు కూడా మానవాళిని కుంగదీస్తున్నాయి. పోషకాహార లోపం, పెరుగుతున్న ఊబకాయం, యాంటీబయోటిక్ మందులకు లొంగని బ్యాక్టీరియా.. ఈ సమస్యలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే వీటిని నిర్లక్ష్యం చేయకూడదు.

**సమగ్ర ప్రణాళికలతోనే పరిష్కారం:**
ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలు చేపడితే ఈ ప్రమాదాలను అరికట్టవచ్చని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సైనిక బడ్జెట్లు, ఆయుధాలపై ఖర్చు చేయడం కంటే ప్రజారోగ్యం, పర్యావరణం, ఏఐ సేఫ్టీ కోసం పెట్టుబడులు పెట్టడం ముఖ్యం. ఇక 35 మంది అగ్రశ్రేణి నిపుణులతో కూడిన కమిషన్ ఈ ప్రమాదాలపై ఏటా సమీక్ష నిర్వహిస్తూ నివేదికను నవీకరించనుంది. ఇక మొత్తానికి చూస్తే, 2100 నాటికి మానవ మనుగడ సాఫీగా సాగాలంటే ఇప్పటి నుంచే మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన వినాశనానికి దారితీసే అవకాశాలను మనమే తొలగించుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, టెక్నాలజీని మంచి పనుల కోసం ఉపయోగిస్తేనే రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వగలం.

# రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలు

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (ఎ+జూ) ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో
జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?

- మొదటి పేజి తరువాయి
నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

# రోడ్లపై కాదు.. ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి

- మొదటి పేజి తరువాయి
ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. "ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ – మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

# నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.
సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు. మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.
హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ-నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## ఎల్ఓసీ వద్ద మందుపాతర పేలుడు: నలుగురు ఉగ్రవాదులు మృతి

- మొదటి పేజి తరువాయి
కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్-నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు. మరోవైపు, మెంధర్ సెక్టార్‌లోని బసోని ప్రాంతంలో సరిహద్దు కంచె సమీపంలో రెండు పాత మందుపాతరలను సైన్యం గుర్తించింది. రహదారి మార్గం నిర్మాణ పనుల సమయంలో సోమవారం ఉదయం 8.25 గంటలకు ఒకటి, మధ్యాహ్నం 12.10 గంటలకు మరొకటి బయటపడ్డాయి. సైనిక నిపుణులు నియంత్రిత పేలుళ్లతో వాటిని నిర్వీర్యం చేశారు. గత వారంలోనూ ఈ ప్రాంతంలో దాదాపు 12 మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు సమాచారం.
ఎల్ఓసీ ప్రాంతాల్లో చొరబాట్లను అడ్డుకునేందుకు మందుపాతరలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే భారీ వర్షాల కారణంగా అవి బయటపడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో వాటిని గుర్తించడం, భద్రతను నిరంతరం పర్యవేక్షించడం సైన్యానికి సవాలుగా మారుతోంది.

'నో' చెప్పారా.. మీ ఖాతాలో

# నగదు మాయం

- మొదటి పేజి తరువాయి
సరికొత్త సైబర్ మోసాలు వెలుగులోకి వస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేవలం వాట్సప్ సందేశాలతోనే, ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్లు క్షణాల్లో సొమ్ము స్వాహా చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయ్యిందంటూ గుర్తు తెలియని నంబర్ల నుంచి నకిలీ సందేశాలు పంపించి, లావాదేవీ చేయకపోతే 'నో' అని రిప్లై ఇవ్వాలని అడుగుతారని, ఆ సందేశాలకు స్పందించగానే మాల్‌వేర్ స్క్రిప్ట్‌లు యాక్టివేట్ అయ్యి.. మొబైల్ హ్యాకర్ల నియంత్రణలోకి వెళ్లే అవకాశముందని చెప్పారు. ఇటీవల చార్టర్డ్ అకౌంటెంట్ ఖాతా నుంచి రూ.లక్ష మాయమయ్యాని, అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే బ్యాంకు లావాదేవీల సందేశాలకు ఎస్, నో అంటూ ఎలాంటి సమాధానమివ్వొద్దని సూచించారు. ఖాతాలో నగదు తగ్గిందన్న సందేశం వస్తే.. అధికారిక బ్యాంకు యాప్‌లో స్టేట్‌మెంట్ తనిఖీ చేసుకోవాలని, ఇంకా అనుమానముంటే అధికారిక కస్టమర్ కేర్‌నే సంప్రదించాలని కోరారు. సైబర్ మోసం వల్ల డబ్బు పోగొట్టుకున్నట్లయితే 1930కి కాల్ చేయాలనీ, లేదంటే ఎఎవతీఎతీఱఎవ.స్త్రశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

- మొదటి పేజి తరువాయి
కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు. బ్రజ్ మోహన్ రామ్ ఒడిశా గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ సుధా యాదవ్ కర్ణాటక గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ ధల్ సింగ్ బిసెన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. దుష్యంత్ గౌతమ్ సిక్కిం గవర్నర్‌గా నియమితులయ్యారు.

## ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

- మొదటి పేజి తరువాయి
మార్చ్ ఫర్ డెమొక్రసీ నిర్వహించిన కూటమి నేతలు.. రాహుల్ గాంధీ సహా 11 మంది సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లను సుప్రీం కోర్టు స్వీకరించింది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేష్ కుమార్, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను రెస్పాండెంట్లుగా చేర్చారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సౌగత్ రాయ్ (టీఎంసీ), అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), తేజస్వి ప్రసాద్ యాదవ్ (ఆర్‌జేడీ), సంజయ్ రౌత్ (శివసేన యూబీటీ), ఎంఏ బేబీ (సీపీఎం), డీ రాజా (సీపీఐ), మహువా మాఝీ (జేఎంఎం), సుప్రియా సూలే (ఎన్‌సీపీ శరద్ పవార్), ఈటీ మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) మొదలైన 11 మంది నేతలు పిటిన్లు దాఖలు చేశారు.

**పిటిషన్లలో ఏముంది..?**
సర్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఫైళ్లు, ఎజెండాలు, నిమిషాలు, నోటింగ్స్, అభ్యంతరాలు బయటపెట్టాలని కోరారు. జాతీయ స్థాయిలో ూ×= ప్రారంభించాలని ఎన్నికల సంఘం అధికారికంగా నిర్ణయం తీసుకున్నట్లు రికార్డులు లేవని =× సమాధానాల ఆధారంగా పేర్కొన్నారు. ఫారం-6ను నిబంధనలు సవరించకుండానే మార్చారని, ఇది మొదటి సారి ఓటు వేసేవారిపై అనవసర భారం వేస్తుందని విమర్శించారు.
2025 జూన్ 24 న సర్ ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయంతోపాటు ఈసీనెట్, ఈఆర్ఓనెట్ యాక్సెస్ లాగ్‌లను వెల్లడించాలని కోరారు. జుజ×చీజు, జు=ాచీజు డేటాబేస్‌లు పారదర్శకంగా పనిచేయడం లేదని, ఓటరు పేర్లు తొలగించిన తర్వాత తిరిగి చేర్చే సౌకర్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ దశలో తొలగింపుకు గురయ్యాయని పేర్కొంటూ, అర్హులైన ఓటర్లు బయట పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
ఎన్నికల సంఘం సమష్టి అధికారాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒంటరిగా వినియోగించుకున్నారని ఆరోపణ. ఇతర ఎన్నికల కమిషనర్ల అనుమతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.
ఆర్టికల్ 324, 2023 చట్టం, టీఎన్ శేషన్ కేసు తీర్పు ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారా అని పరిశీలించాలని కోరారు. ఎలాంటి నోటీసు లేకుండా, వాదన వినిపించుకునే అవకాశం లేకుండా ఏ ఓటరును తొలగించకూడదని డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్ల జాబితాను బూత్ వారీగా, కారణాలు, డెమోగ్రాఫిక్ వివరాలతో ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో స్వతంత్ర ఆడిట్ కమిటీ ఏర్పాటు చేసి ఓటరు జాబితా మార్పులను పరిశీలించాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు సర్ ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్ లో పేర్కొన్నారు.

జనరల్ న్యూస్
ఆర్యాద్వి
www.aryadvi.com

# కూచిపూడి దేవాలయాల సింహద్వారానికి శంకుస్థాపన...






**కోదాడ, అక్టోబర్ 12 (ఆర్యాద్వి):** కూచిపూడి గ్రామంలోని అంతరగంగా వాగు పక్కన శెట్టి వారి వంశస్థుల స్థలంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న దేవాలయాల ప్రాంగణంలో సింహద్వారానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కందికొండ సాయిబాబు మాట్లాడుతూ లక్షల విలువైన భూమిని దేవాలయాల నిర్మాణానికి విరాళముగా ఇచ్చి ఆలయ నిర్మాణానికి పునాదులు వేసిన శెట్టి వారి వంశస్థులకు ధన్యవాదములు తెలియజేస్తూ గ్రామ పెద్దలు,ప్రజల సహకారంతో పెద్ద ఎత్తున దేవాలయాల నిర్మాణం జరుగుతుందని వారి అందరి సహకారంతో శెట్టి వారి దైవభూమి నందు భక్తాంజనేయ స్వామి, సీతా రామాంజనేయ స్వామి ఆలయం, శబరిగిరి అయ్యప్ప మందిరం, లక్ష్మీ నరసింహ స్వామి, షిర్డీ సాయి మందిరాలు ప్రతిష్టకు ముస్తాభవుతున్నాయని ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులు విరివిగా విరాళాలు అందించి భగవంతుని కృపకు పాత్రులు కాగలరని



కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, శెట్టి వెంకట నారాయణ,మందలపు శేషయ్య,శెట్టి నర్సింహా రావు,శెట్టి రమేష్,శెట్టి శ్రీను, గోపి, పసుపులేటి ముత్తయ్య, శిరంశెట్టి చంద్రయ్య, వట్టెం తిరుపతయ్య,మలిశెట్టి మాధవరావు, మలిశెట్టి సాయిబాబు,నాగళ్ల నాగేశ్వరావు,మెట్టు పుల్లయ్య, మెట్టు లక్ష్మి, ముత్యాల పద్మ, గంగిశెట్టి గోపాలరావు, శెట్టి వీరయ్య,మార్నేల వెంకన్న,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కి నిరసన తెలిపే ఏకైక ఆయుధం ఓటుహక్కు




- రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలు మూడేళ్ల కాంగ్రెస్ విధ్వంసకర పాలనకు చెంపపెట్టు సమాధానం కావాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక ప్రక్రియ ఓటర్ నమోదు ప్రక్రియ
- అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- బి మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్

**అనంతగిరి, అక్టోబర్ 12 (ఆర్యాద్వి):** వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రాధాన్యతను వివరించేందుకు కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అనంతగిరి మండలం చనుపల్లి గ్రామంలో అనంతగిరి మండల నాయకులతో కలిసి ఓటరు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుని గుర్తించి ఓటరు నమోదు చేయించే బాధ్యతను నాయకులు అందరూ సమన్వయంతో చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హత కలిగిన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించే విధంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి పట్టభద్రులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ, అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. పార్టీ నాయకులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రతి అర్హుడిని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, ప్రజాస్వామ్య ప్రక్రియలో వారి భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు.

## సర్పంచ్ చొరవతో గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు



**అక్టోబర్ 12, అనంతగిరి (ఆర్యాద్వి):** మండల పరిధిలోని పాలవరం గ్రామంలో రాత్రి వేళల్లో ప్రజల సౌకర్యం మరియు భద్రత కోసం సర్పంచ్ మట్టపల్లి నరేష్ చొరవతో వీధి దీపాలను సోమవారం ఏర్పాటు చేశారు. అంధకారంలో ఉన్న ప్రధాన రహదారులు, కాలనీలు, పాఠశాల పరిసర ప్రాంతాల్లో కొత్తగా దీపాలు అమర్చడంతో గ్రామస్థుల్లో ఆనందం వ్యక్తమవుతున్నారు.
గ్రామ పంచాయతీ పరిధిలోని ముఖ్య వీధుల్లో ఎల్ ఈ డి దీపాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా దీపాలు అమర్చారు. పాతగా మారిన దీపాలను మార్చడం, దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించడం కూడా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,... "గ్రామంలో రాత్రి వేళల్లో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు సురక్షితంగా తిరగాలని ఈ ఏర్పాటు చేశాం అని, మిగిలిన వీధుల్లోనూ దశలవారీగా దీపాలు అమర్చనున్నాం" అని అన్నారు. దీంతో
గ్రామస్థులు, "రాత్రి వేళల్లో కూడా వీధుల్లో వెలుతురు ఉంది కాబట్టి. దొంగల భయం తగ్గింది అని సర్పంచ్‌కు ధన్యవాదాలు" తెల్పారు.

## సోలార్ విద్యుత్ రాయితీలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

### పీఎం సూర్య ఘర్ సేవ సేతు అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి.




**నరసన్నపేట :** సోలార్ విద్యుత్ రాయితీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట నియోజకవర్గం శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన సేవా సేతు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న రాయితీతో కూడిన రూఫ్ టాప్ సోలార్ విద్యుత్తు పవర్ ప్లాంట్లను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సాంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు సోలార్ ప్యానల్ ఏర్పాటుపై భారీగా రాయితీలు (సబ్సిడీలు) అందిస్తున్నాయనితెలిపారు .గృహవినియోగదారులు, రైతులు, వ్యాపారవేత్తలు, తమ భవనాలు పొలాల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులో భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు అని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్తు వాడకం వల్ల ఇళ్లకు వాణిజ్య సాముదాయాలకు విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాకుండా కాలుష్య రహిత పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడతాయని ఎమ్మెల్యే రమణమూర్తి వివరించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న రాయితీలను వివరాలను విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మనలు రోనంకి కృష్ణమనాయుడు, దామోదర నరసింహులు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, మిరియాలపల్లి వెంకటఅప్పలనాయుడు, సారవకోట మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, వంశధార డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ సిమ్మ చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జి గోద్దు చిట్టిబాబు, సూరపు నారాయణదాసు, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ బైరి భాస్కరరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బలగ భారతి,యూనిట్ ఇన్చార్జి పిసా కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, కెవిఎల్ ప్రసాద్, తంగి తారకేశ్వరరావు, కొంక్యన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
ఆర్యాద్వి
www.aryadvi.com

## మృతురాలు మద్దెల హుస్సేనమ్మ కుటుంబానికి అండగా నిలిచిన "చల్లా కృష్ణ "



దానవాయిగూడెం: అక్టోబర్, 12: పాలేరు, నియోజకవర్గ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం గ్రామానికి చెందిన మద్దెల హుస్సేనమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యశీ కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ" చల్లా కృష్ణ"తుంబూరు దయాకర్ రెడ్డి సలహామేరకు" మృతుల కుటుంబాన్నిలి పరామర్శించి , ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు, సోమవారం"దశదిన కార్యక్రమానికిలి " తమ వంతు సహాయంగాలి "చల్లా కృష్ణ " 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికిఎల్లపుడు కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణ టీమ్ సభ్యులు పాల్గొనడం జరిగంది .

# గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



**సరుబుజ్జి అక్టోబర్ 12:** శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలో ఉన్న గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సరుబుజ్జిలి మండలం బిజెపి మహిళా అధ్యక్షురాలు బాడాన యమున ఆవేదన వ్యక్తం చేశారు. వీధులు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు,
మురుగునీరు నిల్వ ఉండటం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడం వల్ల గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. దోమలు, ఈగల వ్యాప్తితో ప్రజలు అనారోగ్య సమస్యలపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య పనుల కోసం సిబ్బంది ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.
చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా గ్రామాలకు వచ్చేలా చూడటంతోపాటు, సేకరించిన వ్యర్థాలను సరైన ప్రదేశాలకు తరలించాలని కోరారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు
శుభ్రం చేయాలన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమం లక్ష్యాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయో సమీక్షించాలని డిమాండ్ చేశారు.ఇంటింటికీ చెత్త సేకరణ, తడి--పొడి చెత్త వేర్పాటు, పారిశుధ్య కార్మికులకు అవసరమైన పరికరాలు, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించేలా పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా పారిశుధ్య సేవలు అందించాలని, గ్రామాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని బాడాన యమున డిమాండ్ చేశారు.

# ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం... శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి







- **కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి**
- **ప్రజలందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహం కలగాలి**
- **ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలి**
- **ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ, శంకుస్థాపన**
- **ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ప్రధాన కారణం : టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు**
- **ఆలయ నిర్మాణానికి పలువురు దాతల విరాళాల ప్రకటన**

**ఖమ్మం, అక్టోబర్-12:** ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం శుభసూచకమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు.
సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో శ్రీవారి భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.
ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివ రావు, మట్టా రాగమయి దయానంద్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, తదితరులు పాల్గొన్నారు.శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో శుభప్రదమని అన్నారు. దేశంలో ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా రైతులు, కుమ్మరులు సహా అన్ని వర్గాల ప్రజలు ముందుగా భగవంతుడిని స్మరించుకుని తమ పనులను ప్రారంభిస్తారని తెలిపారు. భగవంతుడిని స్మరించుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు టెలివిజన్ మాధ్యమం ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.
కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేసేందుకు నేడు తొలి అడుగు పడిందని అన్నారు. ఆశ్వయుజ మాసం సోమవారం నాడు ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని పేర్కొన్నారు. స్వామివారు ఖమ్మం నగరాన్ని పవిత్రం చేసేందుకు స్వయంగా ఇక్కడకు వస్తున్నారని, ప్రజలందరికీ ఆశీస్సులు అందించనున్నారని తెలిపారు.

**శ్రీవారి అలంకార విశేషాల్లో అంతర్లీనమైన ఆధ్యాత్మిక సందేశం:**
శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అలంకార సంప్రదాయానికి సంబంధించిన విశేషాలను వివరించారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం రామానుజాచార్యుల వారి కాలంలో ఏర్పాటైన సంప్రదాయం ప్రకారం, వారంలోని వివిధ రోజుల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించే విధానం కొనసాగుతోందని తెలిపారు.
ఈ సంప్రదాయాల వెనుక భగవంతుని ఆరాధన, ఆధ్యాత్మిక భావన, భక్తుల విశ్వాసం ఉన్నాయని తెలిపారు.ఆశ్వయుజ మాసం సోమవారం నాడే శ్రీనివాసుడు భూమిపై అడుగుపెట్టారని, అదే ఆశ్వయుజ మాసం సోమవారం నాడు ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని , స్వామివారి అనుగ్రహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**వసుధైక కుటుంబ భావన మన ధర్మానికి మూలం:**
మన దేశం, మన ధర్మం ప్రపంచానికి ఆదర్శమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరిపై ఎలాంటి భేదభావాలు లేకుండా భగవంతుని అనుగ్రహం ఉండాలని కోరుకోవడం భారతీయ సంస్కృతిలోని గొప్ప లక్షణమని పేర్కొన్నారు. అందరూ బాగుండాలని కోరుకునే వసుధైక కుటుంబ భావన మన ఆశయమని తెలిపారు.
శ్రీరాముడు బోయవాడిని, శబరిని, పక్షి రూపంలో ఉన్న జటాయువును, విభీషణుడిని కరుణించిన విషయాలను ప్రస్తావిస్తూ, భగవంతుని దృష్టిలో భక్తి, మంచి మనసు, ధర్మబద్ధమైన జీవనానికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.
పదిమందికి మేలు జరగాలని కోరుకునే వారందరూ మనవారేనని, ఇతరులకు హాని కలగాలని కోరుకునే వారు శత్రువులుగా మారుతారని అన్నారు. కృష్ణుడిని ఆరాధించేవారు మనకు మిత్రులు, ద్వేషించేవారు శత్రువులు అనే భావనను బోధాదేవి చెప్పినట్లు ప్రస్తావిస్తూ, మన మంతా ఇదే ధర్మసూత్రాన్ని అనుసరించాలని సూచించారు.వేదాలు బోధించిన సన్మార్గాన్ని ప్రోత్సహించే ప్రతి ఒక్కరూ కులాలకు అతీతంగా మనకు మిత్రులేనని తెలిపారు. కులాల ఆధారంగా విడిపోకుండా, మనమందరం ఒకే భగవంతుని సంతానమని, ఒకే భూమాతకు చెందినవారమని గుర్తించాలని అన్నారు. మనందరికీ ఉమ్మడి గుర్తింపుగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఉండాలని ఆకాంక్షించారు.ధర్మ పరిరక్షణకు ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు:
ప్రజలందరూ ధర్మమార్గాన్ని అనుసరించేలా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రేరణ నిస్తుందని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి తెలిపారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ధర్మం, మానవత్వం, పరస్పర సహకారం, సమాజ శ్రేయస్సు వంటి విలువలను ప్రజల్లో పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని అన్నారు.
శ్రీరాముడు, శ్రీ వేంకటేశ్వర స్వామి మధ్య విడదీయలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని పేర్కొన్నారు. భగవంతుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, సమాజంలో సద్భావన, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు.
ప్రతి భక్తుడు ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావాలి:
ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా విరాళాలు అందించాలని, ప్రతి భక్తుడు ఒక ఇటుక అందించినా ఆలయ నిర్మాణంలో భాగస్వామి అయినట్లేనని అన్నారు.టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నేతృత్వంలో త్వరలోనే సుందరమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆలయం ఖమ్మం ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచి, భక్తులకు స్వామివారి సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు.శ్రీ వేంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేసి ప్రజలందరినీ ఆశీర్వదిస్తున్నారని, ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి కోరారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడుకు, టీటీడీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.శ్రీరాముడి ఆశీస్సులతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తయి ఈ ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఖమ్మం ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి కీలకం:**
టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని అన్నారు. చిన్నతనంలో విక్రమార్కుడి గురించి చదువు కున్నామని, ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూపంలో అలాంటి వ్యక్తిత్వాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు.
దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, రాబోయే ఏడాది కాలంలో ఐదు వేల ఆలయాలను నిర్మించాలనే ప్రణాళిక ఉందని తెలిపారు. అలిపిరి వద్ద రూ. 2,700 కోట్లతో సమగ్ర టౌన్‌షిప్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని, రద్దీ సమయాల్లో సుమారు 20 వేల మందికి వసతి కల్పించేలా ఈ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.పశ్చిమ బెంగాల్, అస్సాం, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ తర్వాత ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి అనుమతి లభించిందని, కరీంనగర్‌లోనూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవు తాయని చెప్పారు.టీటీడీ నిబంధనల ప్రకారం స్థానిక ఆలయ నిర్మాణానికి 25 శాతం నిధులను స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని టీటీడీకి కేటాయించినందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

**భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తాం:**
టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్ మాట్లాడుతూ "వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన। వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥" అనే శ్లోకం శ్రీ వేంకటేశ్వర స్వామి మహిమను తెలియజేస్తుందని అన్నారు.టీటీడీ నమూనాలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఖమ్మంలో నిర్మితం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా భూమి పూజ జరగడం మరింత విశేషమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రాజధానులతో పాటు ముఖ్యమైన పట్టణాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ చర్యలు తీసుకుంటోందని అన్నారు. భక్తుల సహకారంతో ఖమ్మం ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.
అనంతరం ఆలయ నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతల వివరాలను మంత్రి వెల్లడించారు. ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి కూడా ఆలయ నిర్మాణానికి అదనంగా రూ.11 లక్షలు విరాళంగా అందించారు. విరాళాలు ప్రకటించిన దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామిపై భక్తి, విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమ వంతు విరాళాలు అందించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ హన్మంత రావు, ప్రజా ప్రతినిధులు రాయల నాగేశ్వర రావు, విద్యుత్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, దేవాదాయ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు







# ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

## ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు





**ఖమ్మం, అక్టోబర్ - 12:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం సర్టిఫికెట్లో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.
పీడీఎస్‌యూ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.
ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

## ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు




**ఖమ్మం, అక్టోబర్ - 12:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం సర్టిఫికెట్లో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.
పీడీఎస్‌యూ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.
ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టీబీ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, అక్టోబర్ -12:** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షయవ్యాధి (టీబీ) బాధితులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యాధి నుంచి కోలుకునేందుకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చికిత్స మధ్యలో నిలిపివేయకుండా పూర్తికాలం కొనసాగించాలని, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, టీబీ ఆసుపత్రి ఇన్‌చార్జి, జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి డా. నివేదిత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఆర్ ఆర్ అసోసియేట్స్‌లో భారీ ఆఫర్స్....



**కోదాడ,అక్టోబర్ 12 (ఆర్యాద్వి):** దసరా పర్వ దిన సందర్భంగా ప్రత్యేక ప్రైజెస్‌తో ఫ్రిడ్జ్,టీవీ వాషింగ్ మెషీన్లు భారీ ఆఫర్స్ తో ఇప్పుడు లభిస్తున్నాయి . ఆర్ ఆర్ అసోసియేట్స్ వద్ద ప్రస్తుతం అద్భుతమైన ఆఫర్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ బాణాల వెంకట్ మాట్లాడుతూ .మా వద్ద ప్రత్యేక ధరలపై ఫ్రిడ్జ్ వాషింగ్ మెషీన్లు,టీవీ లు అందుబాటులో ఉండటమే కాకుండా, కొనుగోలు చేసే వినియోగదారులకు ఆకర్షణీయమైన ప్రైజెస్ కూడా అందిస్తున్నాం.అంతేకాకుండా షాపు సంవత్సరమంతా వివిధ సేల్స్ మరియు ఆఫర్స్ నిర్వహిస్తుందని, కొనుగోలుదారులకు సరసమైన ధరలతో అందిస్తూ పాటు మంచి సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సేల్స్ ఆఫీసర్ కూడా కొనుగోలుదారును మర్యాదపూర్వకంగా అపూర్వ సేవలు అందిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు ఆకర్షితులై వివిధ వస్తువులు కొనుగోలుకై వస్తున్నారు. కొనుగోలుదారులపై ఈఏంఐ సదుపాయం కూడా కలదు అని బ్రాంచ్ మేనేజర్ బాణాల వెంకట్ తెలిపారు.ద

## ఘనంగా బతుకమ్మ సంబురాలు

**ఇబ్రహీంపట్నం, :**మండల కేంద్రంలోని శ్రీ విద్యాంజలి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు కలిసి తంగేడు, గునుగు, బంతి, నూకలు, జిల్లేడు, మందార, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంబురాల్లో పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన రాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల ప్రాంగణం పూల సౌందర్యంతో, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనిత కుమారి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర జీవన విధానానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలనే దైవంగా కొలిచే ఈ పండుగ మహిళల ఆత్మగౌరవాన్ని చాటుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి, ఐక్యతకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మహిళలకు కుటుంబంలో, సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం కల్పించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనిత కుమారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విద్యార్థినులు, అధ్యాపకులు సరస్వతి, శీలత, జాన్సీ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యావేత్త దుగ్గ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం

: హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ పబ్లిక్ గార్డెన్స్‌లో గల భగవాన్ మహావీర్ ఆడిటోరియంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యావేత్త దుగ్గ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-1 ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరై, దుగ్గ్యాల రామును శాలువాతో సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. విద్యా రంగంలో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు కొనియాడారు. ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, విద్యావేత్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ నిస్వార్థంగా సేవలందించిన దుగ్గ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం అందించడం సముచిత గుర్తింపు అని పేర్కొన్నారు. ఆయన సేవలు భవిష్యత్ తరాల ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. పురస్కార గ్రహీత దుగ్గ్యాల రాము మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన శారదా ఎడ్యుకేషనల్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, విద్యా రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, విద్యావేత్తలు, పలువురు మేధావులు పాల్గొని దుగ్గ్యాల రాముకు అభినందనలు తెలిపారు.

ఆర్యాద్వి

# సంపాదకీయం Editorial




ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కార్డు కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా అత్యంత కీలకం కానుంది. జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులను తమ వైపు తిప్పుకునేందుకు కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తొలి నుంచి టీడీపీకి బీసీలు అండగా నిలుస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లోనూ బీసీలు కూటమి అభ్యర్థుల విజయానికి అండగా నిలిచారు. అయితే బీసీ పురుషులు యాభై ఏళ్లు నిండిన వారికి పింఛన్లు, మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న కూటమి నేతల హామీలు నెరవేరలేదు. దీంతో కొంత వెనకబడిన వర్గాల్లో అసంతృప్తి ఉంది. అయితే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో అది పెద్దగా పనిచేయదని, స్థానిక సంస్థలలో డబుల్ ఇంజిన్ సర్కార్ ను మాత్రమే చూస్తారని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల ను రాజకీయంగా కల్పించేందుకు సిద్ధమయింది.

## 34 శాతం రిజర్వేషన్ల హామీతో...

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే తమ మేనిఫెస్టో హామీకి కట్టుబడి ఉన్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. న్యాయపరమైన చిక్కులు ఎదురైనప్పటికీ, బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం, ప్రాతినిధ్యం కల్పించడమే తమ ధ్యేయమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త కోటా లెక్కల ద్వారా స్థానిక సంస్థల్లో సుమారు 4,000 పైగా అదనపు స్థానాల్లో బీసీలకు అవకాశం లభించనుందని నివేదికలు చెబుతున్నాయి. అయితే అన్నీ బీసీ వర్గాలకు ఇస్తే మిగిలిన సామాజికవర్గాల్లో వ్యతిరేకత వస్తుందేమోనన్న అభిప్రాయం కూడా ఉంది. ఇన్నాళ్లు తాము పార్టీ కోసం పనిచేసింది పదవులు వస్తాయని, అలాంటిది రిజర్వేషన్ల పేరుతో తమను దూరం పెడితే ఎలా? అన్న ప్రశ్న కూడా వారి నుంచి వినపడుతుంది. గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ గత ఎన్నికల్లో తక్కువ స్థానాలకే పరిమితమయిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు.

## జనాభా నిష్పత్తి ప్రకారం...

మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరియు బీసీ సంఘాలు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా నిష్పత్తికి తగ్గట్లుగా న్యాయమైన వాటా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. కోర్టుల పరిధిలో రిజర్వేషన్ల అంశంపై జరిగిన పరిణామాలు ఓటర్లలో ఎలాంటి ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది.బీసీలను తమ సాంప్రదాయ ఓటు బ్యాంక్‌గా భావించే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి.. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆమోదంతో బీసీల నమ్మకాన్ని గెలుచుకోవాలని చూస్తోంది. ఈ 'బీసీ కార్డు' మరియు రిజర్వేషన్ల అమలు తీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయవకాశాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే బీసీ కార్డును ఉపయోగించి ఇప్పటికే జనంలోకి వెళ్లేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అది ఏ మేరకు పనిచేస్తుందన్నది చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో అత్యధిక శాతం ఓటర్లు బీసీలు ఉండటంతోవారిని ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు తమ దైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. మరి చివరకు ఎవరిని బీసీలు కరుణిస్తారన్నది చూడాలి.

# అక్టోబర్ లోనూ హాట్ సమ్మర్... బడుగు జీవులకు వాతావరణం శత్రువే

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నేడు తేలికపాటి వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా పొడి వాతావరణం నెలకొని ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని భావించినా అది ఏర్పడలేదు. దీంతో మరో రెండు రోజుల్లో ఏర్పడే అవకాశముందని వాతావారణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గణనీయంగా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతాయని తెలిపారు. ఒకవైపు తేలికపాటి జల్లులు, మరొకవైపు భారీ ఎండలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మిశ్రమ వాతావరణం చోటు చేసుకునే ఛాన్స్ ఉంటుందని చెప్పారు. కొన్ని చోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయని, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు పడతే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఉక్కపోత కూడా గణనీయంగా ఉంటుందని చెప్పారు.




## ఏపీలో గరిష్ట ఉష్ణోగ్రతలు...

ఆంధ్రప్రదేశ్ లో నేడు గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. విజయవాడ వంటి ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. విజయవాడ మరియు ఇతర జిల్లాల్లో ఎక్కువగా ఎండలు కాస్తాయి, కొన్ని తీర ప్రాంతాల్లో మాత్రం మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై ఉండే సూచనలు ఉన్నాయని చెప్పింది. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ, పల్నాడు జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదయ్యే అవకాశముందని, ఎండాకాలం తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పింది. సాయంత్రానికి కొంత చల్లబడినా ఉక్కపోత మాత్రం కొంత ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉంటుదని, ఎవరూ పగటి వేళ బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## తెలంగాణ వెదర్ పై కీలక అప్ డేట్...

తెలంగాణలో వాతావరణంపై హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు భారీగా నమోదుతున్నాయి. హైదరాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత దాదాపు 33లీ నుంచి 34 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. అక్కడ క్కడ ప్రకాశవంతమైన ఎండతో కూడిన వాతావరణం ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల వల్ల కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసినప్పటికీ, చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొనసాగుతుంది. నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశ ముందని, అది ద వాయుగుండంగా మారితే కొంత వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది. గంటకు ముప్పయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశ ముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. అక్కడకక్కడ తేలికపాటి జల్లులు పడే అవకాశముందని, అయితే మేఘాలు ప్రయాణం మేరకు అవి పడతాయని చెప్పింది. ప్రజలు నీటి ఎద్దడితో ఇప్పటికే సతమతమవుతున్నారు.

రచయితలకు ఆహ్వానం!
మీ ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వండి..
మీ రచనలు, కథలు, కవితలు, వ్యాసాలు, సామాజిక అంశాలపై మీ అభిప్రాయాలను ఆర్యాద్వి పత్రిక ద్వారా పాఠకులకు చేరవేయండి.
మీ రచనలకు మా వేదికపై ప్రత్యేక స్థానం కల్పిస్తాం.
ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను మాకు పంపించండి
Writing
పంపాల్సిన చిరునామా:
వాట్సాప్ నంబర్:
9912456573



# లేడీ ఫ్యాన్‌కు శ్రేయస్ అయ్యర్ క్షమాపణలు..

## ‘తర్వాతి మ్యాచ్‌లో బెస్ట్ ఇన్నింగ్స్ గిఫ్ట్‌గా ఇస్తా’!

వెస్టిండీస్‌తో ఇండోర్ వేదికగా జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ అనంతరం టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ మైదానంలో తన పట్ల అపరిమితమైన ప్రేమను ప్రదర్శించిన ఒక లేడీ ఫ్యాన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం విశేషంగా నిలిచింది. ఈ సిరీస్‌లోని తొలి టీ20లో సెంచరీ సాధించి, రెండో మ్యాచ్‌లో 40 పరుగులతో అలరించిన శ్రేయస్ అయ్యర్‌పై ఈ మ్యాచ్‌లోనూ అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే రోస్టన్ చేజ్ బౌలింగ్‌లో అయ్యర్ కేవలం 1 పరుగు మాత్రమే చేసి ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ప్రియతమ నటుడు/క్రికెటర్ త్వరగా ఔట్ కావడంతో స్టాండ్స్‌లో ఉన్న ఒక లేడీ ఫ్యాన్ తట్టుకోలేక బోరున ఏడ్చేసింది. ఈ భావోద్వేగ దృశ్యాలు కెమెరాలో రికార్డై సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సైతం ఆ అభిమాని ప్రేమాభిమానాలను కొనియాడారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రెజెంటర్ ఇయాన్ బిషప్ ఈ విషయాన్ని శ్రేయస్ అయ్యర్ దృష్టికి తీసుకెళ్లగా, అయ్యర్ ఎంతో నమ్రతతో స్పందించారు. “నేను ఎప్పుడూ జట్టును గెలిపించేందుకు బెస్ట్ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తాను. కానీ ఈ రోజు దురదృష్టవశాత్తూ త్వరగా ఔటయ్యాను. నా ఆట చూడటానికి వచ్చి నిరాశచెందిన ఆ వీరాభిమానికి క్షమాపణలు చెబుతున్నాను. కచ్చితంగా తర్వాతి మ్యాచ్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి, ఆమె ముఖంలో చిరునవ్వు నింపుతాను” అని మాటిచ్చారు. అయ్యర్ మాటలకు ఆనందంతో ఆ అభిమాని స్టాండ్స్‌లోనే కేరింతలు కొట్టింది. ఫ్యాన్స్ పట్ల శ్రేయస్ అయ్యర్ చూపిన ఈ గౌరవానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.




# స్మృతి మంధానకు అరుదైన గౌరవం..

## భారత్‌లో ‘యూనిసెఫ్’ సెలబ్రిటీ సలహాదారుగా నియామకం!

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. భారత్‌లో ‘యూనిసెఫ్’ సెలబ్రిటీ సలహాదారుగా ఆమెను నియమిస్తున్నట్లు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని (అక్టోబర్ 11) పురస్కరించుకుని యూనిసెఫ్ ఈ ప్రత్యేక ప్రకటనను విడుదల చేసింది. ఈ నూతన బాధ్యతల ద్వారా స్మృతి మంధాన బాలికలకు సమాన అవకాశాల కల్పన, ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ మరియు భద్రతకు సంబంధించిన వివిధ అంశాలపై యూనిసెఫ్‌తో కలిసి చురుగ్గా పనిచేయనున్నారు. ముఖ్యంగా క్రీడల ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం, లింగ వివక్షను రూపుమాపడం వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆమె తన వంతు పాత్ర పోషించనున్నారు. ఈ సందర్భంగా యూనిసెఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. క్రీడారంగంలో స్మృతి మంధాన సాధించిన విజయాలు, కోట్లాది మంది యువతులకు మరియు బాలికలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని కొనియాడారు. ఆమె చేరికతో బాలికల హక్కులపై సమాజంలో మరింత అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, క్రీడల్లోనే కాకుండా సామాజిక బాధ్యతలోనూ ముందంజలో నిలిచిన స్మృతి మంధానను అభిమానులు, క్రీడా ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# వేలానికి ముందే ముంబై మాస్టర్‌స్ట్రోక్!

## రూ.10 లక్షలకు మహిళా పేసర్ తారా నోరిస్ సొంతం

- యూపీ వారియర్స్ నుంచి ట్రేడింగ్ ద్వారా దక్కించుకున్న ముంబై ఇండియన్స్
- అక్టోబర్ 28న కొచ్చిలో మహిళల ప్రీమియర్ లీగ్ వేలం
- ఎడమచేతి పేసర్‌తో బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకున్న మాజీ ఛాంపియన్
- ముంబై విదేశీ క్రీడాకారిణుల కోటా పూర్తి.. ఖాతాలో రూ.90 లక్షలు







మహిళల ప్రీమియర్ లీగ్ ఐదో సీజన్ వేలానికి ముందే ముంబై ఇండియన్స్ కీలక అడుగు వేసింది. ట్రేడింగ్ ద్వారా అనుభవజ్ఞురాలైన ఎడమచేతి పేసర్ తారా నోరిస్‌ను జట్టులోకి తీసుకుంది. యూపీ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ మహిళా క్రికెటర్‌ను రూ.10 లక్షలకు ముంబై సొంతం చేసుకున్నట్లు సమాచారం. అక్టోబర్ 28న కొచ్చిలో జరగనున్న వేలానికి ముందే బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకునేందుకు ముంబై యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో అనుభవం ఉన్న నోరిస్ చేరికతో జట్టుకు అదనపు బలం చేకూరుతుందని భావిస్తోంది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ముంబై ఇండియన్స్ రాబోయే సీజన్‌కు పటిష్టమైన జట్టును సిద్ధం చేసుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా యూపీ వారియర్స్‌తో ట్రేడింగ్ ఒప్పందం కుదుర్చుకుని తారా నోరిస్‌ను తీసుకున్నట్లు వెల్లడైంది. గత వేలంలో యూపీ వారియర్స్ ఆమెను రూ.10 లక్షలకు కొనుగోలు చేయగా, ఇప్పుడు అదే మొత్తానికి ముంబైకి బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. దీంతో వేలానికి ముందే ముంబై జట్టులో మరో అనుభవజ్ఞురాలైన విదేశీ క్రీడాకారిణి చేరినట్లయింది. తారా నోరిస్‌కు మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఆడిన అనుభవం ఉంది. 2023 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగిన ఆమె తన ఎడమచేతి పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకుంది. ఆ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి ఏడు వికెట్లు పడగొట్టింది. ముఖ్యంగా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టే బౌలింగ్‌తో గుర్తింపు పొందింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ ఆమెను విడుదల చేయడంతో మరో ఫ్రాంచైజీ తరఫున ఆడే అవకాశం లభించింది. తర్వాతి దశలో యూపీ వారియర్స్ ఆమెను జట్టులోకి తీసుకుంది. అయితే మహిళల టీ20 ప్రపంచకప్ అర్హత పోటీల కోసం అమెరికా జట్టుకు ఎంపిక కావడంతో ఒక సీజన్‌లో ఆమె ఆడలేకపోయింది. అనంతరం 2026 సీజన్ వేలంలో యూపీ వారియర్స్ రూ.10 లక్షలకు నోరిస్‌ను కొనుగోలు చేసింది. సెప్టెంబర్ 28న క్రీడాకారిణులను అట్టిపెట్టుకునే గడువు ముగిసే సమయానికి ఆమెను తమ జాబితాలో కొనసాగించిన యూపీ, ఆ తర్వాత ముంబై నుంచి వచ్చిన ట్రేడింగ్ ప్రతిపాదనకు అంగీకరించినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ కుటుంబంతో తారా నోరిస్‌కు ఇప్పటికే అనుబంధం ఉండటం విశేషం. గతంలో ది హండ్రెడ్ లీగ్‌లో ఎంఐ లండన్ జట్టు తరఫున ఆమె బరిలోకి దిగింది. దీంతో ముంబై ఫ్రాంచైజీ వ్యవస్థలో ఆడటం ఆమెకు కొత్తేమీ కాదు. ఇప్పుడు మహిళల ప్రీమియర్ లీగ్‌లోనూ ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. నోరిస్ చేరికతో ముంబై ఇండియన్స్ విదేశీ క్రీడాకారిణుల కోటా పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం జట్టు వద్ద వేలం కోసం రూ.90 లక్షల నిధులు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తంతో స్వదేశీ క్రీడాకారిణుల ఎంపికపై యాజమాన్యం దృష్టి సారించే అవకాశముంది. రాబోయే సీజన్‌లో మరోసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ముంబై ఇండియన్స్ జట్టు కూర్పుపై కసరత్తు చేస్తోంది. అక్టోబర్ 28న కొచ్చిలో జరగనున్న వేలానికి ముందు చోటుచేసుకున్న ఈ ట్రేడింగ్ మహిళల క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అనుభవజ్ఞురాలైన ఎడమచేతి పేసర్‌ను తక్కువ మొత్తానికే దక్కించుకోవడం ముంబైకి ఉపయోగపడే నిర్ణయంగా భావిస్తున్నారు. రాబోయే సీజన్‌లో తారా నోరిస్ ముంబై ఇండియన్స్ తరఫున ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆరు బంతుల్లోనే అదరగొట్టాడు..

- అరుదైన రికార్డు కొట్టేశాడు!
- మూడు ఫోర్లతో 13 పరుగులు చేసిన ప్రిన్స్ యాదవ్
- పదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కీలక ఇన్నింగ్స్
- శ్రీశాంత్, అశ్విన్ సరసన అరుదైన ఘనత
- దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ ఘనత సాధించిన భారత బ్యాటర్
- వెస్టిండీస్‌పై 14 పరుగుల తేడాతో భారత్ విజయం
- ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-1తో టీమిండియా ఆధిక్యం

వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత యువ క్రికెటర్ ప్రిన్స్ యాదవ్ అరుదైన ఘనత సాధించినట్లు వార్తలు వెలువడ్డాయి. పదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు కేవలం ఆరు బంతుల్లో మూడు ఫోర్ల సహాయంతో 13 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు భారీ స్కోరు సాధించడంలో చివరి వరుస బ్యాటర్‌గా కీలక పరుగులు జోడించాడు. భారత్ ఈ మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో విజయం సాధించిన నేపథ్యంలో ప్రిన్స్ చేసిన 13 పరుగులు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మూడో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 223 పరుగులు సాధించినట్లు అందిన వివరాలు పేర్కొంటున్నాయి. ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు అర్ధశతకంతో ఆకట్టుకోగా, చివరి ఓవర్లలో ప్రిన్స్ యాదవ్ దూకుడుగా ఆడాడు. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగినప్పటికీ ఏమాత్రం వెనుకాడకుండా బౌండరీలు బాదాడు. ఆరు బంతులు ఎదుర్కొని మూడు ఫోర్లతో 13 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో నాలుగు ఓవర్లు వేసిన ప్రిన్స్ యాదవ్ 37 పరుగులు ఇచ్చి వికెట్ సాధించలేకపోయాడు. అయితే బ్యాటింగ్‌లో తనకు లభించిన కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. చివరి ఓవర్లలో అతడు జోడించిన పరుగులు జట్టు స్కోరును 223కు చేర్చడంలో ఉపయోగపడ్డాయి. ప్రత్యర్థికి 224 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో పదో లేదా పదకొండో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒకే ఇన్నింగ్స్‌లో కనీసం మూడు ఫోర్లు బాదిన భారత ఆటగాళ్ల జాబితాలో ప్రిన్స్ యాదవ్ చేరినట్లు పేర్కొంటున్నారు. గతంలో ఎస్. శ్రీశాంత్, రవిచంద్రన్ అశ్విన్ ఈ ఘనత సాధించారు. శ్రీశాంత్ 2007లో న్యూజిలాండ్‌పై, అశ్విన్ 2011లో కోల్‌కతాలో ఇంగ్లాండ్‌పై జరిగిన టీ20లో మూడు బౌండరీలు సాధించినట్లు వివరాలు చెబుతున్నాయి. అశ్విన్ తర్వాత దాదాపు 15 ఏళ్లకు ప్రిన్స్ ఈ జాబితాలో చేరినట్లు సమాచారం. భారత్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులకే పరిమితమైనట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పరుగుల వేటను అడ్డుకున్నారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2--1 ఆధిక్యంలోకి వెళ్లినట్లు సమాచారం. సాధారణంగా భారీ స్కోర్లలో అగ్రశ్రేణి బ్యాటర్ల ప్రదర్శనకే ఎక్కువ గుర్తింపు లభిస్తుంది. అయితే చివరి వరుస బ్యాటర్లు సాధించే కొద్దిపాటి పరుగులు కూడా మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేస్తాయని ప్రిన్స్ యాదవ్ ఇన్నింగ్స్ మరోసారి గుర్తుచేసింది. కేవలం ఆరు బంతుల్లోనే మూడు బౌండరీలు సాధించి జట్టుకు ఉపయోగపడే పరుగులు అందించిన ప్రిన్స్ ప్రదర్శన క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.



# హీరోయిన్‌గా శ్రీకాంత్ కుమార్తె మేధ..

## ‘మైత్రీ ఇన్ లవ్’తో తెరంగేట్రం




తెలుగు సీనియర్ హీరో శ్రీకాంత్, నటి ఊహ దంపతుల కుమార్తె మేధ మేక.. కథానాయికగా వెండితెరకు పరిచయం కాబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ‘మైత్రీ ఇన్ లవ్’ అనే క్యూట్ లవ్ స్టోరీతో ఆమె ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. “వారితో మొదలై, మీ హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది” అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ పోస్టర్‌లో, జై జాస్తి, మేధ ఆత్మీయ ఆలింగనంలో కనిపిస్తున్నారు. జై కూడా ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు. ఆయన గతంలో ‘గాలి సంపత్’, ‘ఎఫ్3’ చిత్రాలకు అనిల్ రావిపూడి వద్ద సహాయ దర్శకుడిగా పనిచేశారు. ‘30 వెడ్స్ 21’, ‘మిడిల్ బెంచ్ రవి’ వెబ్ సిరీస్‌లతో గుర్తింపు పొందిన పృథ్వీ వనం, ఈ సినిమాతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’ దర్శకుడు మహేశ్‌బాబు పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. గీత రచయిత రామజోగయ్య శాస్త్రి తనయుడు సాయి హర్ష సంగీతం అందిస్తున్నారు. నవీన్ యర్నేని, వై రవిశంకర్ నిర్మాతలు. ఇటీవల పూజా కార్యక్రమాలతో చిత్రం ప్రారంభమైంది. ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య సరదా సంఘర్షణలను రొమాన్స్, హాస్యం, కుటుంబ భావోద్వేగాలతో చెప్పే చిత్రమిదని సమాచారం. మేధకు వెండితెర కొత్తేం కాదు. అనుష్క ప్రధాన పాత్రలో వచ్చిన ‘రుద్రమదేవి’లో బాల రుద్రమదేవిగా నటించి మెప్పించారు. ఆమె సోదరుడు రోషన్ ఇప్పటికే ‘పెళ్లి సందడి’, ‘ఛాంపియన్’ చిత్రాలతో హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం శైలేష్ కొలను దర్శకత్వంలో ‘ఏమో ఏమో ఇది’ అనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. అన్న బాటలో హీరోయిన్‌గా మేధ ఎలాంటి విజయాలు అందుకుంటారో చూడాలి!

## పో'స్టార్!


ప్రీతి ముకుందన్

# నవంబర్ 5న ‘రామాయణ’.. దసరా నుంచే టికెట్ల వేట!



బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం ‘రామాయణ’ (పార్ట్-1) నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలో థియేటర్లలోకి వస్తోంది. దీపావళికి మూడు రోజులముందు వస్తున్న ఈ రెండు భాగాల ఇతిహాసంలో, రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్నారు. సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపిస్తారు. కాజల్ అగర్వాల్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. నవరాత్రి తొలి రోజున చిత్ర బృందం కొత్త పోస్టర్‌తో ఈ విడుదల తేదీని ప్రకటించింది. అంతేకాదు,

దసరా రోజైన అక్టోబర్ 20నుంచి అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. అదే రోజున రెండో థియేట్రికల్ ట్రైలర్‌నూ విడుదల చేయాలని బృందం యోచిస్తోందని సమాచారం. ఇందులో రాముని శక్తి సామర్థ్యాలతో పాటు, రావణుని మరింత భయంకరమైన ఉగ్ర రూపాన్ని చూపించనున్నారట. ట్రైలర్ తేదీపై అధికారిక ప్రకటన రాలేదు. నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిదిసార్లు ఆస్కార్ గెలిచిన విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ డీఎన్ఈజీ, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ కలిసి నిర్మిస్తున్న చిత్రానికి హాలీవుడ్ ప్రమాణాలతో విదేశీ నిపుణులు పనిచేశారు. రెండో భాగం 2027 దీపావళికి రానుంది. ఇప్పుడు సినీప్రియుల చూపంతా ‘రామాయణ’ మీదే!



## ‘రామాయణ’ ఘట్టమే హైలెట్ అట

మహేశ్ బాబు, రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న ‘వారణాసి’పై అంచనాలు పెరుగుతున్నాయి. ఈ చిత్రంలో రామాయణంలోని ఒక కీలక ఘట్టం ఉంటుందని రాజమౌళి ఇటీవల ‘ఎంపైర్ ఫిల్మ్ పాడ్‌కాస్ట్’లో వెల్లడించారు. గతంలో వచ్చిన పౌరాణిక చిత్రాలు నచ్చినా, రామాయణం వంటి మహా గ్రంథాలకు తెరపై పూర్తి న్యాయం జరగలేదని ఆయన భావిస్తున్నారట. ఇతిహాసాలను రాసిన తీరుకూ, వెండితెరపై చూపే తీరుకూ మధ్య చాలా తేడా ఉందని, దాన్ని సవాలుగా తీసుకుని ఈ భాగాన్ని రూపొందించానని చెప్పారు. ఈ ఎపిసోడ్ నిడివి తక్కువే అయినా, దాదాపు 60 రోజులు చిత్రీకరించినట్టు రాజమౌళే స్వయంగా చెప్పారు. ఆయన మాటల్లో, ఇందులో అనేక ఉప ఎపిసోడ్లు ఉన్నాయి, ప్రతిదీ ఒక ప్రత్యేక సినిమా తీసినట్టే. భారీ యుద్ధాలు, అద్భుత దృశ్యాలతోపాటు పాత్రల మధ్య లోతైన భావోద్వేగాలకూ ప్రాధాన్యం ఇస్తున్నారు.

‘వారణాసి’లో రామాయణం కేవలం ఒక భాగమేనని, సినిమాలో ఇంకా ఎంతో ఉందని కూడా ఆయన స్పష్టం చేశారు. రాముడు, హనుమంతుడు, వానర సైన్యానికి, కుంభకర్ణుడికి మధ్య భీకర యుద్ధం ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. కానీ దీనికి అధికారిక ధ్రువీకరణ లేదు. కాల ప్రయాణం నేపథ్యంలో సాగే కథలో ఈ ఇతిహాస భాగం ఎలా కలుస్తుందో వేచి చూడాలి.

## వాయిదాల ‘ఆదర్శ కుటుంబం’..

# దీపావళికి వెంకీ సర్‌ప్రైజ్!

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న ‘ఆదర్శ కుటుంబం’ (హౌస్ నెం. 47) విడుదల మరోసారి వాయిదా పడింది. తొలుత అక్టోబర్ 2న అనుకున్న చిత్రాన్ని అక్టోబర్ 9కి మార్చినా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా అదీ సాధ్యపడలేదు. ఇప్పుడు అక్టోబర్ 30న విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్టు సమాచారం. దసరా రోజు అధికారిక ప్రకటనతో పాటు ప్రమోషన్లు మళ్లీ మొదలవుతాయని అంటున్నారు. ఈ సినిమాలో ఒక సర్‌ప్రైజింగ్ గెస్ట్ రోల్ ఉందని తెలుస్తోంది. కమర్షియల్ అంశాలను దృష్టిలో పెట్టుకుని త్రివిక్రమ్ ఈ పాత్రను చేర్చారట. వెంకీ అభిమానులకు ఇది థ్రిల్ ఇస్తుందని అంటున్నారు, అయితే ఆ పాత్ర ఎవరిదో ఇంకా బయటపడలేదు. నివేథా పేతురాజ్, నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, బ్రహ్మాజీ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు తమన్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న ‘రామాయణ’ వస్తున్న నేపథ్యంలో, ఈ చిత్రానికి దీపావళి ముందు స్పష్టమైన విడుదల అవకాశం దక్కనుంది. భారీ అంచనాల మధ్య ‘ఆదర్శ కుటుంబం’ ఎలా అలరిస్తుందో చూడాలి!



# ‘ఇంద్రపుత్ర’ తల్లిగా.. రమ్యకృష్ణ?

‘కె-ర్యాంప్’, ‘చెన్నై లవ్ స్టోరీ’ విజయాల ఆనందంలో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం, తన కెరీర్‌లోనే భారీ బడ్జెట్ పౌరాణిక చిత్రానికి సిద్ధమవుతున్నారు. ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రానికి ‘ఇంద్రపుత్ర’ అనే పేరు ఖరారైంది. ధర్మానికీ, అధర్మానికీ మధ్య శాశ్వత పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకున్న యాక్షన్ ఫాంటసీ ఇది. ఈ చిత్రంలో సీనియర్ నటి రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారని, హీరోకు తల్లిగా కనిపిస్తారని సమాచారం. ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ‘కాంతార: చాప్టర్ 1’కు ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల, ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కీర్తన్ కథ అందించగా, తన్వి ఎన్ దత్తా స్క్రీన్‌ప్లే రాస్తున్నారు. కీర్తన్, కుసుమ్ అరోరా సహ నిర్మాతలు. ఇది నిర్మాతలు ప్లాన్ చేస్తున్న విస్తృత పౌరాణిక ప్రపంచంలో తొలి భాగం. చిత్రీకరణ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడవుతాయి. థ్రిల్లర్ ‘కె.ఎ’, మాస్ ఎంటర్‌టైనర్ ‘కె-ర్యాంప్’, రొమాంటిక్ ‘చెన్నై లవ్ స్టోరీ’ -ఇలా వరుసగా భిన్న జానర్లతో హిట్లు కొడుతున్న కిరణ్, ఈసారి పౌరాణిక అవతారంలో ప్రేక్షకులను మెప్పిస్తారేమో చూడాలి!










# అనిరుధ్ మ్యూజిక్‌తో ‘ఆర్సీ17’?

రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న ‘ఆర్సీ17’కు యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సుకుమార్ సినిమాలకు ఇప్పటివరకు దాదాపుగా దేవిశ్రీ ప్రసాదే సంగీతం అందించారు. ప్రస్తుతం దేవి నటుడిగా బిజీగా ఉండటంతో, అనిరుధ్ పేరు వినిపిస్తోందని కథనాలు చెబుతున్నాయి. నిజమైతే, చరణ్ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించడం ఇదే తొలిసారి అవుతుంది. ఈ జోడీ గతంలోనే కలవాల్సింది. ‘బ్రూస్ లీ’ కోసం తొలుత అనిరుధ్‌నే అనుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి, చివరికి థమన్ సంగీతం అందించారు. చరణ్‌తో పనిచేయాలన్న ఆసక్తిని అనిరుధ్ గతంలో వ్యక్తం చేశారని అభిమానులు గుర్తుచేస్తున్నారు. అయితే ఈ ప్రచారంపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ‘ఆర్సీ17’ సంగీత దర్శకుడిగా ఇప్పటికే దేవిశ్రీ, సాయి అభ్యంకర్, శశ్వత్ సచ్‌దేవ్ పేర్లు కూడా వినిపించాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మించే ఈ భారీ చిత్రం విజయదశమి సందర్భంగా పూజా కార్యక్రమాలతో మొదలవుతుందని, రెగ్యులర్ షూటింగ్ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఉంటుందన్నది టాక్. సంగీత దర్శకుడి పేరుపై స్పష్టత కోసం అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు!